సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 28 । జనవరి । 2023



500 కేజీల గంజాయి స్వాధీనం

మోతుగూడెం పోలీసులు తనిఖీల్లో 500 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

8లో



మెరుగైన వైద్య సేవలందించాలి

రోగలకు మెరుగైన సేవలందించాలని జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదేశించారు.

8లో



రైతులకు అండగా ప్రభుత్వం

నబ్సిడీపై అందిస్తున్న వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు.

8లో

న్యూస్‌రీల్

పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్లకు 28 వరకు గడువు

రాజవొమ్మంగి: ఏటా మాదిరిగానే ప్రభుత్వ పెన్షనర్లు వచ్చే నెల 28లోగా లైఫ్ సర్టిఫికెట్లను అందజేయాలని మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్‌కే కృష్ణవర్మ కోరారు. వేలిముద్రలు పడని వారు, నడవలేని పరిస్థితుల్లో వారు కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని కోరారు. వారికి ఐరిష్, ముఖ గుర్తింపు యాప్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్ పొందే వీలు కల్పిస్తామని తెలిపారు. ప్రతి ప్రభుత్వ పెన్షనర్ (రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు) ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. ఇప్పటి వరకు తమ ఫోన్ నంబర్లలను ఆధార్‌కు లింక్ చేయించుకోకపోతే ఆ పనిని కూడా పూర్తి చేయాలని సూచించారు. ఈకేవైసీ కోసం స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం సందర్శన



అధికారులతో మాట్లాడుతున్న జెన్‌కో ఫైనాన్స్ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

మోతుగూడెం: ఏపీ జెన్‌కో ఫైనాన్స్ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. యూనిట్ల పరిస్థితిపై అధికారులతో మాట్లాడారు. తరువాత అకౌంట్స్ విభాగంతో పాటు సీఈ కార్యాలయం, డీఏవీ స్కూల్, ఏపీ జెన్‌కో ఆస్పత్రిని సందర్శించారు. కొత్తగా నిర్మిస్తున్న ఐదు, ఆరు యూనిట్ల పనులను పరిశీలించారు. వాటి వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంటన సీఈ బి.శ్రీధర్, ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఎస్ఈ సివిల్ ప్రశాంత్‌కుమార్, ఈఈ బాలకృష్ణ, బాబూరావు పాల్గొన్నారు.

ప్రతి నెలా 27న పీఎఫ్ గ్రీవెన్స్



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, వెంకటగిరి

పాడేరు రూరల్ : భవిష్య నిధి కార్యాలయం ద్వారా ఉద్యోగుల, పింఛనుదారుల సమస్యల పరిష్కార దిశగా ప్రతి నెలా 27వ తేదీన గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పి.వెంకటగిరి తెలిపారు. శుక్రవారం ఐటీడీఏలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల ఖాతాలలో నగదు జమ కాకపోవడం, తప్పుగా జమ కావడం. రుణాల మంజూరు, ఇన్సూరెన్స్ క్లెయిమ్ తదితర సమస్యలపై అందిన వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సంబంధిత సిబ్బంది, పింఛన్‌దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందుకు సంబంధించి సమాచార బుక్‌లెట్‌ను జేసీ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఆవిష్కరించారు.

మలేరియాపై క్షేత్రస్థాయిలో అప్రమత్తత అవసరం

జిల్లా మలేరియా అధికారి సాంబమూర్తి



మినుములూరు పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న జిల్లా మలేరియా అధికారి సాంబమూర్తి

పాడేరు రూరల్ : మలేరియాపై క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి సాంబమూర్తి ఆదేశించారు. మండలంలోని మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. గ్రామంలో నిర్వహించిన ఫ్రై డే-డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. రక్త పూతల సేకరణ శాతం అధిగమించాలని, నిర్ధారణ పరీక్షలు నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆస్పత్రిలో మలేరియా నివారణ మందులను తనిఖీ చేశారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. మలేరియా, డెంగ్యూ ప్రబలకుండా తీసుకునే జాగ్రత్తలపై, దోమ తెరల వినియోగంపై, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, పంచాయతీ సర్పంచ్ లంకెల చిట్టమ్మ, పాడేరు సబ్ యూనిట్ మలేరియా అధికారి ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

కొలువుల చదువు.. భవితకు నెలవు

గిరి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతూ రంపచోడవరం ఉపాధ్యాయ శిక్షణ సంస్థ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. బోధనకు అవసరమైన నైపుణ్యం, విజ్ఞానం అందిస్తూ శిక్షణ ఇస్తోంది. వారు కొలువులు సాధించడంలో కీలకపాత్ర పోషిస్తోంది. రాష్ట్రంలోనే గిరిజన ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే ఏకైక కళాశాల ఇదే. ఏటా 50 మంది విద్యార్థులు ఉపాధ్యాయ శిక్షణ పొందుతున్నారు.

- గిరి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న రంపచోడవరం డైట్ కళాశాల
- ఏటా 50 మందికి శిక్షణ
- శతశాతం ఉత్తీర్ణతతో ముందడుగు



రంపచోడవరంలో డైట్ కళాశాల

రంపచోడవరం: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన రంపచోడవరంలోని ఉపాధ్యాయ శిక్షణ కళాశాల (డైట్ కళాశాల) గిరి విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇచ్చి ఉపాధ్యాయులుగా కొలువులు సాధించడంలో ఎంతో దోహదపడుతోంది. నూరుశాతం ఫలితాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.

15 ఏళ్లుగా గురువులుగా తీర్చిదిద్దుతూ...

- రంపచోడవరంలో ఉపాధ్యాయ శిక్షణ కళాశాలను 2008లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రతి ఏటా డైట్ ద్వారా 50 మంది గిరి విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు కళాశాలలో 520 మంది విద్యార్థులు శిక్షణ పొంది బయటకు వెళ్లారు.
- 2008 -2101 విద్యా సంవత్సరానికి సంబంధించి 82 శాతం ఉత్తీర్ణత సాధించింది. 2009 నుంచి 2014 వరకు 96శాతం ఉత్తీర్ణత సాధించింది. 2013 నుంచి 2020 వరకు ఆరు బ్యాచ్‌లు నూరు శాతం ఫలితాలు సాధించాయి. అలాగే 2021 బ్యాచ్ నూరు శాతం ఫలితాలు సాధించాయి.

చక్కని వసతి సదుపాయం : రాష్ట్రంలోని రంపచోడవరం, చింతూరు, పాడేరు, పార్వతీపురం, కన్నపురం ఐటీడీఏల పరిధిలోని విద్యార్థులు ఉపాధ్యాయ శిక్షణ నిమిత్తం రంపచోడవరం ఉపాధ్యాయ శిక్షణ కళాశాలకు రావాల్సిందే.

రంపచోడవరం డైట్ కళాశాలకు అనుబంధంగా హాస్టల్ వసతి కల్పించారు. బాలురకు కళాశాల ఆవరణలోనే హాస్టల్ వసతి ఉంది. బాలికలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని వసతి గృహంలో కల్పించారు.

మెరుగైన శిక్షణ



రంపచోడరంలోని డైట్ కళాశాలలో మెరుగైన శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ తరువాత ఉద్యోగం సాధిస్తామనే భరోసా ఉంది. ఏజెన్సీలో గిరిజన విద్యార్థులకు ప్రత్యేకంగా కళాశాల ఏర్పాటుతో ఎంతో మేలు కలుగుతుంది.

–కల్యాణ్, విద్యార్థి డైట్ కళాశాల, రంపచోడవరం

మెరిట్ విద్యార్థులకే ప్రవేశం



రంపచోడవరం డైట్ కళాశాలలో ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థులకు మాత్రమే ప్రవేశం కల్పిస్తున్నారు. రెండేళ్ల పాటు చదువుకునేందుకు అన్ని సదుపాయాలతో వసతి సమకూరుస్తున్నారు. ఇక్కడ చదివిన అనేక మంది విద్యారంగంలో స్థిరపడ్డారు.

–కోసు ఠాగూర్‌దొర, డైట్ కళాశాల విద్యార్థి.

నూరుశాతం ఫలితాలు



తమ కళాశాలలో చేరిన విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇస్తున్నాం. వారు బాగా చదివేందుకు అవసరమైన వాతావరణం కల్పిస్తున్నాం. కళాశాల నూరుశాతం ఫలితాలు సాధిస్తూ ముందంజలో ఉంది.

–సీహెచ్ చిన్నబాబు, ప్రిన్సిపాల్, డైట్ కళాశాల, రంపచోడవరం

స్పందన వినతులు పరిష్కరించండి

- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ
- 42 వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్ : స్పందనలో అందిన వినతులపై తక్షణమే క్షేత్ర పరిశీలన చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో గిరిజనుల నుంచి ఆయన 42 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. స్పందన వినతు పరిష్కారంపై ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి తరచూ సమీక్షిస్తున్నారని, అందుకు వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పరిష్కరించిన వినతుల వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని సూచించారు. ఆర్థిక పరమైన అంశాలకు సంబంధించిన సమస్యలను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదిస్తే నిధులు మంజూరైన తరువాత పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర బృందం పర్యటన

పాడేరు రూరల్ : జిల్లాలో పీవీటీజీ గిరిజనుల అభివృద్ధి సమీక్ష, వారి జీవన స్థితిగతుల పరిశీలనకు కేంద్ర బృందం శనివారం నుంచి పర్యటిస్తుందని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ తెలిపారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర గిరిజన వ్యవహారల శాఖ సీఎస్ఆర్, పీఈటీ ప్రాజెక్టు జనరల్ మేనేజర్ ఆర్‌జే కచప్ కంపెనీ సెక్రటరీ కుంజ్ బిహారీ, చీఫ్ మేనేజర్ బిస్మిత దాస్‌లను నామినేట్ చేసిందన్నారు. ఆ బృందం సభ్యులు శనివారం నుంచి ఈనెల 30 వరకు మూడు రోజులపాటు పర్యటిస్తారన్నారు. బృందం సభ్యులు దింగ్రియ ఖోండ్, బోండా, పోర్జా, పోరంగి, పోరాజ పీవీటీజీలను కలుస్తారని చెప్పారు. వీరి పర్యటనలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున గిరిజన సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకుడు బి. మల్లికార్జున రెడ్డి, ఐటీడీఏ ఏపీవో వి.ఎస్. ప్రభాకర్‌రావు, విశాఖపట్నం టీసీఆర్ అండ్ టీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చినబాబు, ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, డీడీ కొండలరావు, ట్రైకార్ జనరల్ మేనేజర్ మణికుమార్ పాల్గొంటారన్నారు. ఈ పర్యటనకు సంబంధిత తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, సహాయ ఇంజనీర్లు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

మల్బరీ రైతుకు ఉత్తమ పురస్కారం



కలెక్టర్ చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న మహిళా రైతు చిన సత్యవతి

రాజవొమ్మంగి: మల్బరీ సాగులో అత్యధిక పట్టుగూళ్ల దిగుబడి సాధించిన మండలంలోని కొత్తకింద్ర గ్రామానికి చెందిన గిరి మహిళా రైతు పామి చిన సత్యవతి ఏలూరులో జరిగిన ఆదర్శ రైతుల సన్మాన కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పురస్కారం అందుకున్నారు. ఆమె మూడు ఎకరాల్లో మల్బరీ సాగు చేపట్టారు. ఆమె రికార్డు స్థాయిలో 725 కిలోల పట్టుగూళ్ల దిగుబడి సాధించారు. మార్కెట్లో కిలో పట్టుగూళ్ల ధర రూ.600 కాగా రూ.4.25 లక్షల ఆదాయం పొందారు. పెట్టుబడి రూ.లక్ష పోను సుమారు రూ.3 నికరాదాయం పొందినట్టు రైతు సత్యవతి తెలిపారు. ఉత్తమ పురస్కారం పొందిన ఆమెను పట్టుపరిశ్రమశాఖ డీడీ బీవీ. రామరాజు, ఏఎస్‌వో రంగారావు, టెక్నికల్ ఆఫీసర్ రాజన్నదొర అభినందించారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి/చింతపల్లి రూరల్: మండలంలోని తాజంగి పంచాయతీని కప్పల బెన్నవరంలో టీడీపీకి చెందిన 30 కుటుంబాల గిరిజనులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరామని గిరిజనులు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని పథకాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తోందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనూషాదేవి. జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, వైస్‌ఎంపీపీ గోపినాయక్ శారద, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు దురియా పుష్పలత, తాజంగి సర్పంచ్ శాంతికుమారి పాల్గొన్నారు.

పొల్లూరు జలపాతం అభివృద్ధికి చర్యలు

డీఎఫ్‌వో వాకపల్లి సాయిబాబా



పొల్లూరు జలపాతాన్ని సందర్శించిన డీఎఫ్‌వో సాయిబాబా

మోతుగూడెం: పొల్లూరు జలపాతం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు డీఎఫ్‌వో వాకపల్లి సాయిబాబా తెలిపారు. పొల్లూరు జలపాతాన్ని శుక్రవారం అయన సందర్శించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ విశ్రాంత భవనంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పొల్లూరు జలపాతాన్ని వివిధ దశలలో అభివృద్ధి చేసేందుకు వనసరంక్షణ సమితి ఏర్పాటు చేసి వారి ఆధ్వర్యంలో పనులు చేపడతామన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నుంచి నాలుగు రోజులపాటు పొల్లూరు జలపాతం వద్దకు పర్యాటకులను అనుమతి లేదన్నారు. జలపాతం వద్ద, పరిసరాల్లో చెత్తను తొలగించి శుభ్రపరుస్తామన్నారు. అలాగే జలపాతానికి 50 మీటర్ల దూరంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేసి పర్యాటకుల నుంచి కొంత రుసుం వసూలు చేస్తామని ఆయన వెల్లడించారు. వాహనాలు పార్కింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు.మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గదుల సౌకర్యం కల్పించడమే కాకుండా పర్యాటకలు భోజనాలు చేసేందుకు అనువుగా ఏర్పాట్లు చేస్తామన్నారు. జలపాతం వద్ద వచ్చిన ఆదాయం వనసంరక్షణ సమితి సభ్యులకు జీతాలు చెల్లిస్తామని తెలిపారు. జలపాతం వద్దకు వచ్చిన పర్యాటకులు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లక్కవరం, ఇంచార్జ్ ఎఫ్ఆర్‌వో కొండలరావు, డీఆర్వో సత్యనారాయణరాజు , వెంకట్ , బేస్ క్యాంపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు త్వరితగతిన పరిష్కారం

రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా గ్రామాలు ఖాళీ చేసి నిర్వాసితులైన వారి సమస్యలు త్వరగా పరిష్కరించాలని కోరినట్టు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. తాడేపల్లి సీఎం కార్యాలయంలో శుక్రవారం పోలవరంపై జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న ఆమె ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపారు. గోదావరి వరదలకు నష్టపోయిన ఇళ్లకు నష్టపరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలిపారు. 41.5 కాంటూర్‌లో ఉన్న గ్రామాలకు త్వరగా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందజేయాలని కోరామని చెప్పారు. మార్చి, ఏప్రిల్ నెలాఖరు నాటికి అందరికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపినట్టు ఎమ్మెల్యే వివరించారు. 45.5 కాంటూర్‌లో ఉన్న గ్రామాలకు ఏప్రిల్ నుంచి సర్వే మొదలు పెడతారని చెప్పారు. ఆర్అండ్ఆర్‌లో అర్హులైన తరువాత చనిపోయిన వారి కుటుంబాలకు నామినీగా గుర్తించి వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందజేస్తారని తెలిపారు. భూమికి భూమి ఇచ్చి పట్టాలు అందని వారికి పట్టాలు ఇస్తారని తెలిపారు. అలాగే భూమికి ఇవ్వని వారికి త్వరలో భూమిని ఇస్తారని తెలిపారు. అలాగే విలీన మండలాల్లోని 17 గ్రామాలను 41.5 కాంటూర్‌లో చేర్చాలని కోరినట్టు ఎమ్మెల్యే వివరించారు.

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు



మంచులో తప్పని దైనందిన జీవనం



పాడేరు-జి.మాడుగుల రోడ్డులో కురుస్తున్న మంచు



చలి మంట కాగుతూ ఉపశమనం

సాక్షి, పాడేరు: ఏజెన్సీలోని కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. చింతపల్లి పరిశోధన కేంద్రంలోని 5.5 డిగ్రీలు, మినుములూరు కేంద్ర కాఫీ బోర్డు వద్ద 7 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీ బోర్డులోని 7.9 కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పొగమంచు తేలికగానే కురుస్తోంది. చలిగాలులు విజృంభిస్తున్నాయి. అన్ని వర్గాల ప్రజలు చలితీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు చలిమంటలు వేసుకుంటున్నారు.

రాజవొమ్మంగి: మండల కేంద్రమైన రాజవొమ్మంగి పరిసరాల్లో దట్టంగా కురుస్తున్న మంచు వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున మంచు చినుకులు మాదిరిగా పడింది. ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు వీడలేదు. చలి తీవ్రత ఎక్కువగా ఉంది. వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. మామిడి, జీడిమామిడి పూతకు నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మోదకొండమ్మ తీర్థ మహోత్సవం రేపు





విద్యుత్ అలంకరణలో మోదకొండమ్మ అమ్మవారి ఆలయం

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవమైన మోదకొండమ్మతల్లి ఆలయం వద్ద ఈనెల 29న ఆదివారం తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు కసరత్తు చేస్తున్నారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడుతో పాటుగా ఇతర కమిటీ సభ్యులంతా ఉత్సవ ఏర్పాట్లు నిమగ్నమయ్యారు. ఇప్పటికే అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరగనున్నాయి. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన ఏర్పాటుచేస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి సింహాచలంనాయుడు తెలిపారు. ముగ్గులు పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని సాయంత్రం 4 గంటల నుంచి ఊరేగించనున్నట్టు తెలిపారు.

పశువైద్యానికి అధిక ప్రాధాన్యం

ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

చింతపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యంతో పాటు పశు వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లి సుభద్ర అన్నారు. మండలంలోని తాజంగిలో శుక్రవారం వైఎస్సార్ పశు సంచార ఆరోగ్య వాహనాన్ని ఆమె ప్రారంభించారు. రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం సంచార పశువైద్య వాహనాలతో రైతులకు మరింత మేలు చేకూరుతుందని ఆమె అన్నారు. ప్రతి గ్రామంలో పశువులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఈ వాహనాలు సమకూర్చిందన్నారు. గిరిజనులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటు వంటి పథకాలు ప్రవేశపెట్టిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనన్నారు. ప్రభుత్వ పథకాలే రానున్న ఎన్నికల్లో ప్రభుత్వానికి శ్రీ రామ రక్షగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ బాలయ్య, పశు సంవర్థక శాఖ ఏడీహెచ్ఏ చంద్రశేఖర్, పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

వార్షిక వేడుక.. ఆధ్యాత్మిక వీచిక



ఆగమ సదస్సులో స్వామీజీని పూలమాలతో సత్కరిస్తున్న పండితులు

- వైభవంగా ప్రారంభమైన శారదాపీఠం వార్షికోత్సవాలు
- వేదమంత్రోచ్ఛరణలతో మార్మోగిన ప్రాంగణం
- శాస్త్రోక్తంగా యాగాలు



రాజశ్యామల అమ్మవారు

సింహాచలం : విశాఖ శ్రీశారదాపీఠం వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరగనున్న వార్షికోత్సవాలను పురస్కరించుకుని పీఠం మరింత ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. తొలిరోజు శుక్రవారం వైదిక కార్యక్రమాలతో పీఠం ప్రాంగణం మార్మోగింది. వేద పారాయణలతో ప్రజ్వరిల్లింది. ఉదయం 7.30గంటలకు పీఠాధిపతులు స్వరూపానందేంద్రసరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి గణపతి పూజ నిర్వహించి వార్షికోత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం యాగశాల ప్రవేశం చేసి పీఠం అధిష్టాన దైవం రాజశ్యామల అమ్మవారి యాగానికి శ్రీకారం చుట్టారు. ఐదు రోజులపాటు టీటీడీ ఆధ్వర్యంలో జరగనున్న శ్రీనివాస చతుర్వేద హవనంకి కూడా శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. పెద్ద ఎత్తున పండితులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి సారథ్యంలో నిత్య పీఠ పూజ విశేషంగా జరిగింది. అలాగే సాయంత్రం 6 గంటలనుంచి సాంస్కృతిక కార్యక్రమాలను విశేషంగా నిర్వహించారు. రాత్రి రాజశ్యామల అమ్మవారికి మహా మంగళ హారతి అందజేశారు.

పీఠంలో ప్రముఖులు

విశాఖ శ్రీశారదాపీఠం వార్షికోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం పలువురు ప్రముఖులు పీఠానికి తరలివచ్చారు. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఆశాఖ కమిషనర్ హరి జవహర్‌లాల్, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు దేవస్థానాల ఈవోలు, ఏపీ పీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు పీఠాన్ని సదర్శించిన వారిలో ఉన్నారు. వీరంతా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకున్నారు.

వార్షికోత్సవాల్లో నేటి కార్యక్రమాలు

వార్షికోత్సవాల్లో శనివారం రథసప్తమిని పురస్కరించుకుని అరుణ పారాయణం, సూర్యనమస్కారాల కార్యక్రమాలను నిర్వహిస్తారు. రాజశ్యామల యాగం, చుదుర్వేద హవనం, చాత్తాద వైష్ణవాగమ సదస్సు నిర్వహిస్తారు. మన్యుసూక్తహోమం (ఇష్టియాగం) నిర్వహిస్తారు.

రైతులకు అండగా ప్రభుత్వం

డుంబ్రిగుడ: ప్రభుత్వం గిరి రైతులకు సబ్సిడీపై అందిస్తున్న వ్యవసాయ యంత్రాలు, సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. అరకు సంతబయలు గ్రామంలో ఆయన శుక్రవారం పర్యటించారు.గిరిజన రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన పవర్ టిల్లర్ మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని, అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి గోపాల్, సర్పంచ్ వెంకటరావు, నాయకులు గణపతి, మల్లేష్, మార్కెట్ డైరెక్టర్ బిబి సాత్రు, వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



కంకిపాట మోహనరావు

రాజవొమ్మంగి : కిమ్మిలిగెడ్డ గ్రామానికి చెందిన కంకిపాటి మోహనరావు (33) కనబడుటలేదని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ గోపీ నరేంద్రప్రసాద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. మోహనరావు నవంబర్ 30వ తేదీన కూలీ పనుల కోసం సత్తుపల్లి ప్రాంతానికి వెళుతున్నాడని ఇంటి వద్ద తెలిపాడు. ఆ తరువాత ఆచూకీ లేకుండా పోయాడని భార్య విజయకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

హుకుంపేట: మండలంలోని హుకుంపేట, ఉప్ప పీహెచ్‌సీలను జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. మందుల నిల్వలను పరిశీలించారు. పీహెచ్‌సీలో గదులను పరిశీలించి, వైద్య సేవలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. గర్భిణులు, మాతా శిశు సంరక్షణ, ప్రసవాలు తదితర వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీల వైద్యాధికారులు సుమన, అనూష, ప్రశాంత్, జిల్లా ఆరోగ్య పర్యవేక్షకులు శాంతారావు, సూపర్‌వైజర్ సదానందం తదితరులున్నారు.

500 కిలోల గంజాయి స్వాధీనం

మోతుగూడెం : మోతుగూడెం పోలీసులు శుక్రవారం తనిఖీల్లో భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మోతుగూడెం ఎస్‌ఐ వి.సత్తిబాబు, సిబ్బందితో గొడ్లగూడెం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సుకుమామిడి నుంచి బీదర్, కర్ణాటక రాష్ట్రాలకు వ్యాన్‌లో తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నారు. వ్యాన్‌లో 20 ప్లాస్టిక్ మూటల్లో తరలిస్తున్న 500 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో బీదర్‌కు చెందిన బనాదీష్, మహారాష్ట్రకు చెందిన సంతోష్, సంజయ్ యాదవ్‌లను అరెస్టు చేశారు. ఒడిశాకు చెందిన ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నట్టు ఎస్‌ఐ తెలిపారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ పట్టాభిరామయ్య, హెచ్‌సీలు రాజేశ్వరరావు, సత్తిబాబు, పీసీలు మురళీకృష్ణ, సన్యాసిరావు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.15 లక్షలు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. రెండు ఫోన్‌లు, ఆధార్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆటో, వ్యాన్ బోల్తా

అరకులోయ రూరల్ : మండలంలో సుంకరమెట్ట, మాదల పంచాయతీల పరిధిలో వేరువేరుగా శుక్రవారం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. సుంకరమెట్ట పంచాయతీ కేంద్రం నుంచి కటికి జలపాతం తిలకించేందుకు పర్యాటకులు ప్రయణిస్తున్న ఆటో మలుపు వద్ద అదుపుతప్పి లోయలో బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. మాదల పంచాయతీ పరిధిలో దోమలజోరు, రత్తకండి మోడల్ కాలనీలో ఇటుకల లోడుతో వెళుతున్న వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదు.



లోయలో పడిన ఆటో

'పశువుల దొంగలపై చర్యలేవీ'



ఆందోళన చేస్తున్న గిరి రైతులు

ముంచంగిపుట్టు : పశువుల దొంగలు పట్టుబడి 24 గంటలు అవుతున్నా అరెస్టు చేయకపోవడం, కేసు నమోదు చేయకపోవడంపై మినుములపుట్టు, జంగంసరియా గ్రామాల గిరిజన రైతులు, ప్రజా ప్రతినిధులు ఆందోళనకు దిగారు. శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి పశువుల దొంగలను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. నిందితులపై తక్షణమే గోహత్య నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో కించాయిపుట్టు సర్పం సుభాష్‌చంద్ర, మాజీ ఎంపీటీసీ గాసిరావు, జర్రెల వైస్ సర్పంచ్ గణపతి, నేతలు గాసి రాందొర, విశ్వనాథం , కర్రిబాబు, కొండలరావు, బలరాం పాల్గొన్నారు. స్థానిక ఎస్‌ఐ రవీంద్రను వివరణ కోరగా దొంగలను అరెస్టు చేసి, దర్యాప్తు చేసి, విచారణ ఆధారంగా కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

ఇష్టపడి చదవాలి



బహుమతులు అందుకున్న విద్యార్థినిలు, చిత్రంలో బీజేవైఎం నేతలు

హుకుంపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో బీజేవైఎం నాయకులు సురేష్ కుమార్ ఆధ్వర్యంలో పరీక్ష పే చర్చ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్ష పే చర్చ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ ప్రసంగం ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థులతో కలిసి వీక్షించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలతో ఆందోళన చెందవద్దని, ధైర్యంగా రాయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహించిందన్నారు. పరిక్ష పే చర్చ కార్యక్రమం ద్వారా విద్యార్థులు మంచి నైపుణ్యత పొందే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు పొందవచ్చన్నారు. నాయకులు రామకృష్ణ, మత్స్యకొండబాబు, సత్యవతి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.